జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 30 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 6



# అన్నపురెడ్డిపల్లిలో కలెక్టర్ అంకిత్ విస్తృత పర్యటన

నరసాపురంలో భూ రీ సర్వే ప్రక్రియపై క్షేత్రస్థాయి పరిశీలన

- గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు
- రికార్డుల ఆధారంగా భూముల వివరాలను పక్కాగా నిర్ధారించాలి
- విద్యార్థుల భద్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



2 లో...



కౌలు రైతు ఫిర్యాదుతో పంట నరికివేత జరిగిన ప్రాంతానికి చేరుకుని పరిశీలిస్తున్న పోలీసులు. ఘటనను పరిశీలించినప్పటికీ.. తదుపరి చర్యలు తీసుకోలేదని బాధితుడు ఆరోపిస్తున్నాడు.

2 లో..

# కౌలు రైతు పంటపై.. రాజకీయ దౌర్జన్యం!

- రాజకీయ అండదండలతో చెలరేగుతున్న నేతల ఆగడాలు?
- 60 ఎకరాల్లో జామాయిల్ పంట.. మూడో పంటపై కన్ను
- పంట నరికివేత.. విక్రయించుకున్నారన్న ఆరోపణలు
- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకో లేదన్న బాధితుడు
- కౌలు చేస్తున్నట్లు రెవెన్యూ అధికారుల నిర్ధారణ ఉన్నా చర్యలేవీ?

రాజకీయ అండదండలు ఉంటే ఏం చేసినా చెల్లుతుందా..? సామాన్యుడి కష్టానికి విలువ లేదా..? అన్న ప్రశ్నలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవి పల్లి మండల పరిసర ప్రాంతంలోనీ దూదియ తండా పంచాయతీ లో చోటుచేసుకున్న ఓ కౌలు రైతు వ్యవహారం నేపథ్యంలో తలెత్తుతున్నాయి. ఇక్కడి అదే గ్రామ పంచాయతీలోని మున్యాతండా సమీపంలో ఉన్న సుమారు 60 ఎకరాల భూమిని సూర్య తండాకు చెందిన మురళి అనే కౌలు రైతు కౌలుకు తీసుకుని 2014 నుంచి జామాయిల్ తోట సాగు చేస్తున్నాడు. ఇప్పటికే ఈ భూమిలో రెండు పంటలు తీసుకున్న సదరు రైతు.. మూడో పంటకు సిద్ధమైన సమయంలో తన ఆధీనంలోని భూమిలోకి కొందరు వ్యక్తులు వెళ్లి మొత్తం పంటను నరికివేసి, విక్రయించుకున్నారన్న ఆరోపణలు ఇప్పుడు కలకలం రేపుతున్నాయి.

● భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

# పశువుల స్థావరంగా మారిన అశ్వాపురం బస్టాండ్



ఏళ్లు గడుస్తున్నా బస్టాండ్‌కు మోక్షం లేదు.. ఎండా వానలో ప్రయాణికుల అవస్థలు

**అశ్వాపురం, సెప్టెంబర్, 29,ప్రజాజ్యోతి** అశ్వాపురం: ఏళ్లు గడుస్తున్నా అశ్వాపురం మండలానికి పూర్తి స్థాయి బస్టాండ్ అందని ద్రాక్షగానే మిగిలింది. పేరుకు బస్టాండ్ ఉన్నప్పటికీ, ప్రస్తుతం అది అధ్వాన స్థితిలో ఉండటంతో పశువుల సంచారానికి, స్థావరంగా మారిందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బస్టాండ్ ప్రాంగణంలో పరిశుభ్రత కొరవడటంతో చెత్తాచెదారం పేరుకుపోవడం, పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగిపోవడం, పశువులు సంచరించడం వంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రయాణికులు కూర్చునేందుకు సరైన సదుపాయాలు లేకపోవడంతో బస్సుల కోసం రోడ్డుపైనే నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండ తీవ్రతలో నీడ కోసం, వర్షం సమయంలో తలదాచుకునేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో కనీస మౌలిక వసతులు లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. బస్సులు నిలిపేందుకు నిర్దిష్ట స్థలం లేకపోవడంతో రోడ్డు పక్కనే బస్సులు ఆపాల్సి వస్తోంది. దీంతో ప్రయాణికులు రోడ్డుపైనే బస్సులు

మిగతా 2 లో...

# దళిత, ఆదివాసీల ఆత్మగౌరవ పరిరక్షణకు కృషి చేయాలి




- ఢిల్లీలో జాతీయ స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**దమ్మపేట,సెప్టెంబరు.29 (ప్రజాజ్యోతి):** దళిత, ఆదివాసీ వర్గాల ఆత్మ గౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణపై ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి సమావేశంలో

మిగతా 2 లో...

# మా దవాఖానకు జ్వరం వచ్చింది.. జర బాగు చేయండి సారు!

- దయనీయ స్థితిలో గుండాల దవాఖాన
- రోజుకో డాక్టర్‌తో కాలం వెళ్లదీత
- 56 గ్రామాలకు ఇదొక్కటే ఆధారం




**గుండాల, సెప్టెంబర్ 29, ప్రజాజ్యోతి:** రోజురోజుకూ వైద్య రంగం అభివృద్ధి చెందుతూ అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వస్తున్నతరుణంలో గుండాల మండల ప్రజలకు మాత్రం ప్రాథమిక వైద్యం కూడా అందని పరిస్థితి నెలకొంది. 56 గ్రామాలకు ఏకైక ఆధారంగా ఉన్న గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది, మందులు, సౌకర్యాల

మిగతా 2 లో...

## పశువుల స్థావరంగా మారిన అశ్వాపురం బస్టాండ్

(మొదటి పేజీ తరువాయి...)

ఎక్కడం, దిగడం జరుగుతోంది. రద్దీ సమయాల్లో ఇది ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అశ్వాపురం మండలంలోని అనేక గ్రామాల ప్రజలు విద్య, వైద్యం, వ్యాపారం, ప్రభుత్వ కార్యాలయాల పనుల కోసం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. పెద్ద మండలంగా ఉన్న అశ్వాపురంలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్టాండ్ లేకపోవడం ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారింది.మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వరకు ప్రజాప్రతినిధులు మారినా బస్టాండ్ సమస్య మాత్రం పరిష్కారం కాలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో బస్టాండ్ నిర్మాణం, అభివృద్ధిపై హామీలు వినిపిస్తున్నా ఆచరణలో మాత్రం ముందడుగు పడటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ప్రయాణికుల కోసం షెడ్డు, సీటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, పారిశుధ్యం వంటి కనీస వసతులు కల్పించడంతో పాటు బస్సులు సురక్షితంగా నిలిపేలా తగిన ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఏళ్ల తరబడి కొనసాగుతున్న బస్టాండ్ సమస్యకు ఇకనైనా శాశ్వత పరిష్కారం చూపి, అశ్వాపురం ప్రజల ఇబ్బందులకు ముగింపు పలకాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## అన్నపురెడ్డిపల్లిలో కలెక్టర్ అంకిత్ విస్తృత పర్యటన





**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 29, (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. నరసాపురం గ్రామ పరిధిలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సర్వే సిబ్బంది, తహసీల్దార్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. రికార్డుల ఆధారంగా ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన విస్తీర్ణం, హక్కుదారులు, సంబంధిత శాఖల వివరాలను సమగ్రంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా రీ సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు, ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.అనంతరం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలతో పాటు తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలలు, ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకుల నిల్వలు, పారిశుధ్యం, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి మెనూ, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, వసతి సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.వంటశాలల్లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని, బియ్యం, పప్పులు తదితర సరుకులను సురక్షితంగా నిల్వ చేయాలని కలెక్టర్ సూచించారు. బల్లులు, ఎలుకలు, ఇతర కీటకాలు ప్రవేశించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ఆహార కలుషితానికి, ఫుడ్ పాయిజనింగ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేకుండా జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. గురుకులాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో తహసీల్దార్ స్వర్ణ, ఆయా గురుకులాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సర్వే సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కౌలు రైతు పంటపై.. రాజకీయ దౌర్జన్యం!



కౌలు రైతు సాగు చేస్తున్న జామాయిల్ తోటలో చెట్లను నరికివేస్తున్న దృశ్యం. తన అనుమతి లేకుండానే పంటను నరికివేశారని బాధితుడు ఆరోపిస్తున్నాడు.

**ఏళ్లుగా సాగు.. మూడో పంటపై దౌర్జన్యం?**

సదరు కౌలు రైతు 2014 నుంచి అదే భూమిని కౌలుకు తీసుకుని జామాయిల్ సాగు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే రెండు పంటలను నరికి విక్రయించుకున్న ఆయన.. మూడో పంటను కూడా పెంచుకున్నాడు. అయితే పంట చేతికొచ్చే సమయంలో కొందరు రాజకీయ అండదండలు ఉన్న అదే మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వ్యక్తులు భూమిలోకి ప్రవేశించి పంట మొత్తాన్ని నరికివేసి తీసుకెళ్లినట్లు రైతు ఆరోపిస్తున్నాడు. కష్టపడి సాగు చేసిన పంటను తన అనుమతి లేకుండా నరికివేయడంతో భారీగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోతున్నాడు. దీనిపై ప్రశ్నిస్తే తనపై దాడి చేస్తున్నారని ఆవేదన చెందుతున్నాడు.

**పోలీసులకు ఫిర్యాదులు.. స్పందన కరువు?**

ఈ వ్యవహారంపై బాధిత రైతు పలుమార్లు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. అయితే భూమికి సంబంధించిన కౌలు హక్కులు, యాజమాన్య వివరాలు స్పష్టంగా తెలియాల్సి ఉందంటూ పోలీసులు రెవెన్యూ శాఖ నుంచి సమాచారం రావాల్సి ఉందని చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో బాధితుడు సంబంధిత తహసీల్దార్ కార్యాలయాన్ని కూడా ఆశ్రయించాడు. అక్కడి నుంచి భూమి సాగు, కౌలు వివరాలపై సమాచారం సేకరించినట్లు6 తెలుస్తోంది.

**రెవెన్యూ నివేదిక ఉన్నా.. చర్యలెక్కడ?**

సదరు రైతు 2014 నుంచి భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడని, ఇప్పటికే రెండు పంటలు తీసుకున్నాడని రెవెన్యూ అధికారి స్థాయిలో ఇచ్చిన లేఖలో పేర్కొన్నట్లు బాధితుడు చెబుతున్నాడు.

దీంతో భూమి విషయంలో రైతు సాగు చేస్తున్నాడా లేదా అన్న సందేహానికి సంబంధించి రెవెన్యూ శాఖ నుంచి సమాచారం వచ్చినప్పటికీ..పంట నరికివేతపై మాత్రం పోలీసుల నుంచి తగిన చర్యలు కనిపించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం తన ఫిర్యాదు తీసుకునేందుకు కూడా పోలీసులు ఇష్టపడటం లేదని ఆరోపిస్తున్నాడు. ఈ విషయంపై ఇప్పటికే ఎంతమందో పోలీసు అధికారులకు తన గోడు చెప్పుకున్న వాళ్లు పట్టించుకోవడంలేదని వాపోతున్నాడు.

**రాజకీయ అండ ఉంటే.. సామాన్యుడికి న్యాయం లేదా?**

అయితే ఈ ఘటనపై స్థానికంగా మరో ప్రశ్న కూడా తీవ్ర చర్చకు దారితీస్తోంది. రాజకీయ పలుకుబడి ఉన్న వారు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే.. ఏళ్లుగా భూమిని సాగు చేసుకుంటున్న కౌలు రైతు పరిస్థితి ఏంటి అన్నదే ఆ ప్రశ్న. తన కష్టంతో పంటను సాగు చేసుకున్న రైతు.. పంట చేతికొచ్చే సమయంలో దాన్ని కోల్పోతే అతని నష్టానికి బాధ్యత ఎవరిది అన్నది తేలాల్సి ఉంది.

కేవలం రాజకీయ పలుకుబడి, నాయకుల అండదండలతో పోలీసు, రెవెన్యూ వ్యవస్థలపై ప్రభావం చూపుతున్నారన్న భావన ప్రజల్లో ఏర్పడితే.. అది ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. అందుకే ఈ వ్యవహారంలో పంట నరికివేతకు పాల్పడిన వారు ఎవరు..? వారికి రాజకీయ అండ ఉందా..?

పోలీసులకు అందిన ఫిర్యాదులపై ఇప్పటివరకు ఏ చర్యలు తీసుకున్నారు..? రెవెన్యూ శాఖ ఇచ్చిన నివేదికను పోలీసులు ఎలా పరిగణించారు..? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. కౌలు రైతు పంటపై జరిగినట్లు ఆరోపిస్తున్న ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సమగ్ర దర్యాప్తు జరిపి, బాధితుడికి న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

### చుంచుపల్లి సీఐపైనే ఆరోపణలు..

చుంచుపల్లి సర్కిల్ పరిధిలో ఉన్న చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ పోలీస్‌స్టేషన్లపై ఇప్పటికే పలు ఫిర్యాదులు, ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా స్టేషన్లలో జరిగే వ్యవహారాలపై సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణపైనా ఇప్పుడు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ పలుకుబడి ఉన్న కొందరు నేతలు ఫోన్లు చేయడంతో.. వారి ప్రయోజనాలకు అనుగుణంగా సీఐ వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా సామాన్యులు ఇచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించకుండా, రాజకీయ అండ ఉన్నవారి వ్యవహారాలకు ఇతను ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గతంలో ఇదే సర్కిల్ పరిధిలో ఓ ఎస్ఐ సస్పెండ్ కావడం కూడా ఈ అధికారి పనితీరుపై ప్రశ్నలు తలెత్తడానికి కారణమైంది. తాజా పరిణామాల నేపథ్యంలో సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లపై వస్తున్న ఫిర్యాదులను ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించి, రాజకీయ జోక్యం ఉందా? లేదా? అన్నది తేల్చాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## మా దవాఖానకు జ్వరం వచ్చింది.. జర బాగు చేయండి సారు!

(మొదటి పేజీ తరువాయి...)

కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**రోజుకో డాక్టర్‌తో వైద్యం**

గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యుల్లో ఒకరు బదిలీపై వెళ్లగా, మరొకరు మెడిసిన్ చదువు కోసం వెళ్లినట్లు సమాచారం. దీంతో వైద్యుల కొరత ఏర్పడింది. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఒక వైద్యుడిని డిప్యూటేషన్‌పై నియమించినప్పటికీ, ఆయన కూడా నిరంతరంగా సేవలు అందించలేకపోయారు. జూలై నుంచి దాదాపు రెండు నెలల పాటు వైద్యుల కొరత కొనసాగినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం గత నాలుగు రోజులుగా జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఎంబీబీఎస్ వైద్యులను రోజుకొకరి చొప్పున గుండాలకు డిప్యూటేషన్‌పై పంపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈరోజు వచ్చిన వైద్యుడు రేపు ఉండరు.. రేపు వచ్చిన వైద్యుడికి గత రోజు పరిస్థితులు తెలియని పరిస్థితి నెలకొంది.

**అత్యవసర వేళల్లో ఇబ్బందులు..**

జూన్ 20న శంభునిగూడెం గ్రామానికి చెందిన ఓ నిండు గర్భిణి గుండాల ఆరోగ్య కేంద్రానికి వచ్చిన సమయంలో తగిన వైద్య సేవలు అందక పసికందుతో పాటు తల్లిని కోల్పోయిన ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనతో పాటు అత్యవసర వైద్యం అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు అనేకం ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

**సిబ్బంది కొరతతో సేవలకు ఆటంకం..**

వైద్యులతో పాటు మందుల పంపిణీకి అవసరమైన ఫార్మసీ సిబ్బంది, ఇతర సిబ్బంది కొరత కూడా ఉందని తెలుస్తోంది. దీంతో ఆరోగ్య కేంద్రం ఉన్నా పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యులను నియమించాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆరోపిస్తున్నారు.

**110 కిలోమీటర్లు వెళ్లాల్సిందే..**

గుండాల పూర్తిస్థాయి ఏజెన్సీ మండలం. మండలం విస్తీర్ణం కూడా ఎక్కువగా ఉండటంతో అత్యవసర లేదా మెరుగైన వైద్యం కోసం ప్రజలు సుమారు 110 కిలోమీటర్ల దూరంలోని వరంగల్, ఖమ్మం, కొత్తగూడెం ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. ప్రాథమిక వైద్యం కోసం కూడా ఆర్ఎంపీలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పాలకుల లోపమా.. అధికారుల నిర్లక్ష్యమా?**

56 గ్రామాలకు ఒకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్న గుండాలలో వైద్య సేవలు ఇలా అస్తవ్యస్తంగా మారడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. శాశ్వతంగా వైద్యులను నియమించి, అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసి, మందులు, అత్యవసర వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. “మా దవాఖానకు జ్వరం వచ్చింది.. జర బాగు చేయండి సారు” అంటూ గుండాల ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

## దళిత, ఆదివాసీల ఆత్మగౌరవ పరిరక్షణకు కృషి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా మావలంకర్ హాల్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, దళిత, ఆదివాసీ ప్రతినిధులు హాజరయ్యారు.కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం, ఏఐసీసీ ఎస్సీ విభాగం, ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక అసమానతలు, వివక్ష, హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాజ్యాంగం కల్పించిన సమానత్వం, స్వేచ్ఛ, గౌరవంతో జీవించే హక్కులను కాపాడేందుకు ప్రజాప్రతినిధులు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని పలువురు ప్రతినిధులు ప్రస్తావించారు.ఎస్సీ, ఎస్టీల రక్షణకు ఉద్దేశించిన చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడం, వివక్షకు తావులేకుండా సామాజిక వాతావరణాన్ని కల్పించడం, ఆయా వర్గాల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాలపై సమావేశంలో అభిప్రాయాలు పంచుకున్నారు.ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సమావేశంలో పాల్గొని దళిత, ఆదివాసీ వర్గాలకు సంబంధించిన హక్కు లు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయంపై జరిగిన చర్చల్లో భాగస్వామ్యమయ్యారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ సమావేశం ద్వారా అశ్వారావుపేట నియోజకవర్గం తో పాటు తెలంగాణలోని దళిత, గిరిజన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను విస్తృత వేదికపై ప్రస్తావించే అవకాశం లభించిందని ఎమ్మెల్యే కార్యాలయం పేర్కొంది.

# వెట్‌ల్యాండ్స్ డీమార్కేషన్, అటవీ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

• జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 29, (ప్రజాజ్యోతి) వెట్‌ల్యాండ్స్ డీమార్కేషన్, అటవీ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో వెట్‌ల్యాండ్స్ సరిహద్దుల నిర్ధారణ, అటవీ భూముల పరిరక్షణ, ఆక్రమణల నియంత్రణ, అటవీ భూముల మళ్లింపు, ఆర్ఓఎఫ్ఆర్, సంబంధిత శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఐటీడీఏ పీఓ రాహుల్, అదనపు కలెక్టర్ డి.వెంకటగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ అంకిత్ సమీక్ష నిర్వహించారు. వెట్‌ల్యాండ్స్ సరిహద్దుల నిర్ధారణలో కేవలం ఆన్‌లైన్ రికార్డులు, కేఎంఎల్ మ్యాపింగ్‌కు మాత్రమే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో భౌతికంగా పరిశీలించి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ, నీటిపారుదల, వ్యవసాయ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో సర్వే చేపట్టి, క్షేత్రస్థాయి పరిస్థితులను రికార్డులు, కేడస్ట్రల్ మ్యాపులు, అందుబాటులో ఉన్న పాత రికార్డులతో సరిపోల్చి పరిశీలించాలన్నారు. డీజీపీఎస్ సాంకేతికత అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో దానిని వినియోగిస్తూ వేగంగా డీమార్కేషన్ పూర్తి చేయాలని, అవసరమైన చోట మొబైల్ జీపీఎస్ ద్వారా కూడా క్షేత్రస్థాయి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. వెట్‌ల్యాండ్స్ డీమార్కేషన్‌లో పాత నీటిపారుదల రికార్డులు, రెవెన్యూ రికార్డులు, సర్వే మ్యాపులను సమగ్రంగా పరిశీలించి హద్దులను స్పష్టంగా గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. వెట్‌ల్యాండ్స్‌కు సంబంధించిన కేఎంఎల్ డేటా, కేడస్ట్రల్ మ్యాపులు, రెవెన్యూ రికార్డుల మధ్య ఏవైనా వ్యత్యాసాలు ఉంటే వాటిని పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. వెట్‌ల్యాండ్స్ పరిధిలో ప్రభుత్వ, నీటిపారుదల శాఖ భూములు, ప్రైవేట్ భూములు, ఆక్రమణలకు సంబంధించిన అంశాలను స్పష్టంగా గుర్తించి ప్రత్యేకంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత శాఖల రికార్డుల్లో ఉన్న వివరాలను పరస్పర సమన్వయం చేసుకుని భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు అవకాశం లేకుండా పూర్తి స్థాయి డాక్యుమెంటేషన్ నిర్వహించాలని సూచించారు. అటవీ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అంకిత్ తెలిపారు. అటవీ భూముల్లో ఆక్రమణలను గుర్తించి, రెవెన్యూ, పోలీస్, అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ, అటవీ, అసైన్డ్ భూములపై ఉన్న ఆక్రమణలను రికార్డుల ఆధారంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. అటవీ భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించి, ఆక్రమణలకు అవకాశం లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,. అటవీ ఆక్రమణల తొలగింపు, ఇతర సున్నితమైన ప్రాంతాల్లో చేపట్టే చర్యలకు అవసరమైన సందర్భాల్లో పోలీస్ శాఖ సహకారం ముందుగానే సమన్వయం చేసుకోవాలని సూచించారు. అటవీ సిబ్బందిపై దాడులు, బెదిరింపులు వంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని, అటవీ సంరక్షణకు పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అటవీ భూముల మళ్లింపు, అటవీ భూముల కేటాయింపు, ఫారెస్ట్ క్లియరెన్స్ (ఎఫ్‌సీపీ), రహదారులు, విద్యుత్ లైన్లు తదితర అంశాల్లో శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ తెలిపారు. వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన అటవీ భూముల మళ్లింపులో నిబంధనలు, అనుమతులు, పరిహార భూముల వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పూర్తిగా పరిశీలించి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ఆర్ఓఎఫ్ఆర్ దరఖాస్తులు, కోర్టు కేసులు, రెవెన్యూ–అటవీ భూముల హద్దుల వివాదాలను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు ఆర్డీఓలు, తహసీల్దార్లు, అటవీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అటవీ సంరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అన్నారు. అటవీ ప్రాంతాలు, అభయారణ్యాల పరిధిలో విద్యుత్ లైన్ల కారణంగా వన్యప్రాణులకు ప్రమాదం జరగకుండా అవసరమైన సాంకేతిక చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో రక్షణ ప్రమాణాలకు అనుగుణంగా విద్యుత్ లైన్ల ఏర్పాటుపై సంబంధిత శాఖలు సమన్వయం చేసుకోవాలని తెలిపారు. కిన్నెరసాని ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధికి రూపొందించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కిన్నెరసాని అభయారణ్య ప్రాంతంలో పర్యాటక మౌలిక వసతుల అభివృద్ధి, సఫారీ, కాటేజీలు, గిరిజన పర్యాటక సర్క్యూట్, మ్యూజియం తదితర ప్రతిపాదనలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి శాఖ తన పరిధిలో చేపడుతున్న పనులపై నెలవారీ పురోగతి వివరాలను సిద్ధం చేసుకుని సమీక్షకు సమర్పించాలని కలెక్టర్ అంకిత్ తెలిపారు. అటవీ, రెవెన్యూ, పోలీస్, నీటిపారుదల, ఆర్అండ్‌బీ, విద్యుత్, ఐటీడీఏ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తే భూ పరిరక్షణ, అటవీ సంరక్షణ, అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. ఈ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎం. విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, భద్రాచలం ఎఫ్‌డీఓ నిషా, కొత్తగూడెం ఆర్డీఓ మధు, తహసీల్దార్లు, అటవీ, రెవెన్యూ, నీటిపారుదల, పోలీస్, విద్యుత్, ఆర్అండ్‌బీ, ఐటీడీఏ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం





చర్ల, సెప్టెంబర్ 29 : (ప్రజా జ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చెందిన ఆరోగ్య విద్యాకురాలు డి. పరంగిణి మంగళవారం చర్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, రుతుక్రమ పరిశుభ్రతపై విద్యార్థినులకు వివరించారు. పాఠశాల, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణకు ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలని సూచించారు. కూలర్లు, పూలకుండీల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని తెలిపారు.ప్రతిరోజూ స్నానం చేయడం, రోజుకు రెండు సార్లు పళ్లు తోముకోవడం, భోజనానికి ముందు, మరుగుదొడ్డిని ఉపయోగించిన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. రుతుక్రమ సమయంలో శుభ్రమైన ప్యాడ్లు ఉపయోగిస్తూ పరిశుభ్రత పాటించాలని తెలిపారు.ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, గుడ్లు, చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని, ప్యాకెట్ ఆహారాలు, శీతల పానీయాలను తగ్గించాలని ప్రతిరోజూ తగినంత నీరు తాగాలని పరీక్షల భయం, మానసిక ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలు ఎదురైతే టెలి-మానస్ 14416కు ఫోన్ చేసి 24 గంటలూ ఉచిత మానసిక ఆరోగ్య సలహాలు పొందవచ్చని, వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు.అనంతరం పాఠశాల వంటశాల, నిల్వ గది, మరుగుదొడ్లు, వసతి గదులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా నిర్వహిస్తున్న సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి భాను ప్రియాంక, ఉపాధ్యాయులు, ఆరోగ్య పర్యవేక్షకులు రాంప్రసాద్, మధ్యస్థాయి ఆరోగ్య సంరక్షకురాలు తులసి, ఆరోగ్య కార్యకర్తలు రంగమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## మామిడిగూడెంలో ఆరోగ్య శిబిరం



చర్ల, సెప్టెంబర్ 29 : (ప్రజా జ్యోతి): చర్ల మండలం సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మామిడిగూడెం గ్రామంలో మంగళవారం వైద్యాధికారి డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై వైద్య సేవలు పొందారు.శిబిరంలో సాధారణ జలుబు, దగ్గు తదితర సమస్యలతో వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జ్వరం ఉన్న వారికి ర్యాపిడ్ డయాగ్నస్టిక్ పరీక్షలు (ఆర్‌డీటీ), రక్తంలో చక్కెర పరీక్షలు నిర్వహించడంతో పాటు రక్త నమూనాలు సేకరించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి అవసరమైన మందులు అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని వైద్య సిబ్బంది సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదురైనా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని అవగాహన కల్పించారు.ఈ శిబిరంలో మొత్తం 72 మంది సాధారణ రోగులకు వైద్య సేవలు అందించగా, జ్వరంతో బాధపడుతున్న ముగ్గురికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సందీప్, ఎంఎల్‌హెచ్‌పీ పి. పార్వతి, హెల్త్ అసిస్టెంట్ టి. వేణు, ఆశా కార్యకర్త రాధ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ మహిళను స్వయంగా కలిసి అర్జీ స్వీకరించిన సబ్‌కలెక్టర్

భద్రాచలం, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి): దివ్యాంగ మహిళ సమస్యను పరిశీలించి, అర్హత మేరకు త్వరితగతిన పరిష్కరించాలని భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన దివ్యాంగ మహిళను కార్యాలయం వెలుపల సందర్శకుల ప్రాంతంలో సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ స్వయంగా కలిసి ఆమె వినతిపత్రాన్ని నేరుగా స్వీకరించారు. సమస్య వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన, వినతిపత్రాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.అదేవిధంగా మహిళకు అర్హత ఉన్న అన్ని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఏఓ భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పొదెం వీరయ్యపై నిరాధార కథనాలు సరికాదు

• వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు



చర్ల, సెప్టెంబర్ 29 :(ప్రజా జ్యోతి): సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యపై ఇటీవల కొన్ని పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న నిరాధార, వాస్తవాలకు విరుద్ధమైన కథనాలను కాంగ్రెస్ పార్టీ తరపున ఖండిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు తెలిపారు.పొదెం వీరయ్య సుమారు నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీతో కొనసాగుతున్న సీనియర్ నాయకుడని, పార్టీ సిద్ధాంతాలకు, గాంధీ కుటుంబ రాజకీయ భావజాలానికి కట్టుబడి పనిచేస్తున్నారని కాంగ్రెస్ అభ్యర్థిగా ఆరు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన ములుగు నియోజకవర్గం నుంచి రెండుసార్లు, భద్రాచలం నియోజకవర్గం నుంచి 2018లో ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు సేవలందించారని తెలిపారు.2018-2023 మధ్య కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో జిల్లాలోని కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా నిలిచి పార్టీ బలోపేతానికి కృషి చేశారని శ్రీనివాసరావు అన్నారు . అలాంటి నాయకుడిపై ఊహాగానాలు, నిర్ధారణ లేని అంశాల ఆధారంగా కథనాలు ప్రచురించడం సరికాదన్నారు.వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం రాజకీయాలు చేయకుండా ప్రజా సమస్యలపై ప్రజాక్షేత్రంలో పనిచేయడానికే పొదెం వీరయ్య ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. వాస్తవాలను పూర్తిగా పరిశీలించకుండా వ్యక్తుల ప్రతిష్టకు భంగం కలిగించేలా వార్తలు ప్రచురించవద్దని, నిరాధార ప్రచారాన్ని ప్రజలు నమ్మకుండా వాస్తవాలను పరిశీలించాలని ఇర్ప శ్రీనివాసరావు కోరారు.

## గుండాల పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

- కేసుల వివరాలు సకాలంలో నమోదు చేయాలి





**గుండాల సెప్టెంబర్ 29 ప్రజా జ్యోతి** గుండాల పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, కార్యాలయ నిర్వహణ, రికార్డుల తో పాటు సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దర్యాప్తులు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు త్వరతగా పూర్తిచేసి బాధితులకు న్యాయం అందేలా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. శాంతి భద్రతకు విఘాతం కల్పించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు గ్రామాలలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితుల తో బాధ్యతగా వ్యవహరించి, త్వరిత గతిన సేవలందించాలని కోరారు. పోలీస్ స్టేషన్ కాంపౌండ్ వాల్, గాడ్ పోస్ట్ కు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులకు కోరారు పోలీస్ స్టేషన్ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, సిబ్బందితో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గుండాల సీఐ శ్రీపతి తిరుపతి ఎస్సై శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాలూరి పెంటాచారి మృతికి నివాళులు



**ఇల్లందు, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి)** పట్టణంలోని 17వ వార్డుకు చెందిన కాలూరి పెంటా చారి అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం శ్రీహరి వాసం గ్రూప్ చైర్మన్ పెండేల హరికృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజులు వారి స్వగృహానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. పెంటాచారి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు గోపగాని రాజు, గందె పద్మ సదానందం, మెరుగు కార్తీక్, కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ క్రీడల్లో శ్రీవిద్యకు స్వర్ణం




**చర్ల, సెప్టెంబర్ 29: (ప్రజా జ్యోతి ):** చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థిని మడకం శ్రీవిద్య దొర అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో సత్తాచాటింది. ఇటీవల పంజాబ్, పాండిచ్చేరిలలో నిర్వహించిన అంతర్జాతీయ 80 మీటర్ల హార్డిల్స్, లాంగ్ జంప్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నరేందర్ శ్రీవిద్య దొరను ఘనంగా సత్కరించి అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి కళాశాల కు, చర్ల ప్రాంతానికి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టి.అండ్ హెచ్ ఎం అధ్యాపకులు ప్రభాకర్, రమేష్, కళాశాల బోధ న, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని శ్రీవిద్య దొరకు అభినందనలు తెలిపారు.

# మామిడి గుండాల రాఘవేంద్రరావు భూములపై రీ సర్వే

- అక్టోబర్ 3న గ్రామసభకు హాజరు కానున్న ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఆర్డీఓ
- పారదర్శకంగా డిజిటల్ సర్వే నిర్వహిస్తాం తహాసిల్దార్: షా ఖాసీం




**ఇల్లందు సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి)** ఇల్లందు మండలం మామిడి గుండాల రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న సీలింగ్ భూములను రీ సర్వే చేసేందుకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని తహాసిల్దార్ షా ఖాసిం తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ మామిడి గుండాలరాఘవేంద్రరావు భూములపై రీ సర్వే చేయడం జరుగుతుందన్నారు. గత 40 ఏళ్లుగా ఆ ప్రాంత గిరిజన రైతులు కొంత భూమిని సాగు చేసుకుంటూ అనువాదారులుగా ఉన్నారని వీటికి సరిహద్దులు నిర్ణయించి అర్హులైన వారికి ప్ర భుత్వం నుండి పట్టాలు అందించేందుకు ప్రభుత్వం రీ సర్వే చేసేందుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని తెలిపారు. మామిడి గుండాల రెవెన్యూ విలేజ్ పరిధిలోని సువర్ణపురం, రాజ్యా తండా, చాపల వారి గుంపు, బోటి గుంపు గ్రామాల్లో నివాసం ఉంటున్న రైతుల ఈ భూమిని గత కొన్ని సాగు చేసుకుంటూ అనుభవదారులుగా ఉన్నట్లు పేర్కొన్నారు. సర్వేకు ముందు అక్టోబర్ 3తేదీన మామిడి గుండాల గ్రామంలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఈ గ్రామ సభకు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్, ఆర్డిఓ హాజరుకానున్నట్లు తెలిపారు. వీరు సాగు చేసుకుంటున్న భూమికి సరైన సరిహద్దులు పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడం వల్ల ప్రభుత్వం రైతులకు మంజూరు చేసే రైతు సంక్షేమ పథకాలు రైతుబంధు వాటికి నోచుకోకుండా పోతున్నారని ఇవి వారికి అందించేందుకు సర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సర్వే పూర్తి పారదర్శకంగా ఎలాంటి అవకతవకలు జరగకుండా అర్హులైన వారికి పట్టాలు అందేలా చూస్తామన్నారు. ప్రజలు రైతులు పూర్తిస్థాయిలో ప్రభుత్వ అధికారులకు ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డిటి, ఆర్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య విద్యలో ప్రభుత్వ సీటు సాధించిన నివేదన్ను అభినందించిన ఎమ్మెల్యే పాయం



**పినపాక, సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి )** పినపాక మండలం ఈ.బయ్యారం గ్రామానికి చెందిన శ్రీరామ్ నివేదన్ నీట్లో ప్రభుత్వ సీటు సాధించి వైద్య విద్యలో ప్రవేశం పొందడం పట్ల పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నివేదన్ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి చదివి నీట్లో ప్రభుత్వ సీటు సాధించడం అభినందనీయమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. నివేదన్ సాధించిన విజయం ఆయన తల్లిదండ్రులు ప్రముఖ రిపోర్టర్ శ్రీరామ్ బృహస్పతి, లతతో పాటు కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా ఈ.బయ్యారం గ్రామం, పినపాక ప్రాంతానికే గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎమ్మెల్యే అన్నారు. నివేదన్ వైద్య విద్యలో రాణించి భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నివేదన్కు అభినందనలు తెలియజేయడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## శ్రీరాముడిపై సీఎం వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ ఆందోళన

- బ్రిడ్జి సెంటర్లో రేవంత్రెడ్డి దిష్టిబొమ్మ దహనం



**భద్రాచలం, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి ):** శ్రీరాముడిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ భద్రాచలంలో భారతీయ జనతా పార్టీ భద్రాద్రి జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. భద్రాచలం బ్రిడ్జి సెంటర్లో సీఎం రేవంత్రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. శ్రీరాముడిని ధనికుల దేవుడిగా, పరమశివుడిని పేదల దేవుడిగా అభివర్ణించడం హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని బీజేపీ నాయకులు విమర్శించారు. దేవుళ్లను ఆర్థిక వర్గాల ప్రాతిపదికన విభజించి మాట్లాడటం సరికాదన్నారు. సీఎం వ్యాఖ్యలపై బీజేపీ నేతలు రాష్ట్రవ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి కొలువై ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి మరింత బాధ్యతగా వ్యవహరించాలని నాయకులు కోరారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని హిందువులకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్రెడ్డి డిమాండ్ చేశారు.

## ప్రపంచ పవర్ లిఫ్టింగ్ పోటీలకు భద్రాచలం వాసి

- ప్రభుత్వం తరపున ఆర్థిక సహకారం అందించండి
- ఎమ్మెల్యే వెంకటరావు కి వినతిపత్రం అందజేసిన డి.వి. శంకరరావు, కోచ్ రామ్ రెడ్డి



**భద్రాచలం, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి ):** అమెరికాలోని రెనో, నెవాడాలో అక్టోబర్ 2026లో జరగనున్న వరల్డ్ క్లాసిక్ అండ్ ఈక్విప్డ్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించనున్న భద్రాచలానికి చెంది న జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ డి.వి. శంకరరావు తనకు ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రిని కోరారు. పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ప్రయాణ, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షల ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ తన కోచ్ గొంగడి వెంకట రామిరెడ్డితో కలిసి భద్రాచలం ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రికి పంపేందుకు వినతిపత్రాన్ని అందజేశారు. హార్ట్ బైపాస్ సర్జరీ అనంతరం పవర్ లిఫ్టింగ్ లోకి ప్రవేశించిన శంకరరావు జాతీయ స్థాయి లో పలు పతకా లు సాధించడంతో పాటు రికార్డులు నెలకొల్పారు. అంతర్జాతీయ స్థా యి పోటీల్లో భారత్ కు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కడం భద్రాచలానికి గ ర్వకారణమని తెలిపారు. ప్రభుత్వం 'ఖేలో ఇండియా', 'ఫిట్ ఇండియా' వంటి కార్యక్రమాల ద్వారా క్రీడలు, ఫిట్ నెస్ ను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో తన అభ్యర్థనను సానుకూలంగా పరిశీలించి ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని శంకరరావు కోరారు.



# బతికుండగానే డెత్ సర్టిఫికెట్ పై విచారణ షురూ

- మ్యుటేషన్ చేయించుకున్న వారికి నోటీసులు
- సంబంధిత అధికారికి మెమో జారీ
- ఒరిజినల్ దృవపత్రాల కోసం ఇతర మున్సిపాలిటీలు, తహసీల్దార్ కు లేఖలు



**ఇల్లెందు, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి)** బతికున్న వ్యక్తికి డెత్ సర్టిఫికెట్ జారీ చేసి, దాని ఆధారంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తో మున్సిపాలిటీలో ఆస్తి మ్యుటేషన్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ ప్రారంభమైనట్లు ఇల్లందు మున్సిపల్ కమిషనర్ సందీప్ తెలిపారు. ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలను పరిగణనలోకి తీసుకొని ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో వివరాలు సేకరిస్తున్నామని ఆయన వెల్లడించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో కమిషనర్ మాట్లాడుతూ ఫేక్ దృవపత్రాల ఆధారంగా మ్యుటేషన్ జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులు, కథనాల నేపథ్యంలో సంబంధిత రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో మ్యుటేషన్ చేయించుకున్న దరఖాస్తుదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, మ్యుటేషన్ ప్రక్రియకు సంబంధించి విధులు నిర్వహించిన అధికారికి మెమో జారీ చేసినట్లు పేర్కొన్నారు. డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తదితర దృవపత్రాల నిజానిజాలను నిర్ధారించేందుకు సంబంధిత శాఖల నుంచి అసలు రికార్డులను తెప్పించే చర్యలు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. డెత్ సర్టిఫికెట్ కు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలను అందజేయాలని హైదరాబాద్, మంచిర్యాల మున్సిపాలిటీల అధికారులను కోరినట్లు తెలిపారు. అదేవిధంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కు సంబంధించిన వివరాలను దృవీకరించేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి కూడా లేఖ రాసినట్లు తెలిపారు. సంబంధిత శాఖల నుంచి ఒరిజినల్ దృవపత్రాలు అందిన అనంతరం వాటిని మున్సిపల్ రికార్డులతో సరిపోల్చి పరిశీలిస్తామని తెలిపారు. దృవపత్రాల పరిశీలన పూర్తయిన తర్వాత అసలు విషయం వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినట్లు లేదా నిబంధనలకు విరుద్ధంగా మ్యుటేషన్ చేసినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దోషులుగా తేలిన పక్షంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓకు ఫిర్యాదు చేసి, చట్టపరమైన చర్యలకు సిఫారసు చేస్తామని తెలిపారు.

# భద్రాచలం టౌన్ సీఐ నాగరాజు బదిలీ

- ఖమ్మం ఖానాపురం హవేలీ సీఐగా బాధ్యతలు
- భద్రాద్రి వాసులతో ప్రత్యేక అనుబంధం ఏర్పరచుకున్న సీఐ నాగరాజు



**భద్రాచలం, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి):** తెలంగాణ మల్టీజోన్-1 పరిధిలో పలువురు పోలీస్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భద్రాచలం టౌన్ సీఐ మేడిపల్లి నాగరాజును ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. మల్టీజోన్-1 ఐజీపీ సంపత్ చంద్రశేఖర్‌రెడ్డి సెప్టెంబర్ 28న ఈ మే రకు ఉత్తర్వులు జారీ చేశారు.భద్రాచలంలో క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతలు స్వీకరించిన సీఐ నాగరాజు లా అండ్ ఆర్డర్‌ను క్రమబద్ధీకరించడంలో ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణ ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ ఫ్రెండ్లీ పోలీసిం గ్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన పలు కార్యక్రమా ల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజలకు చేరువయ్యారు.గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపడంతో పాటు అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకొని పట్టణంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు కృషి చేశారు. దీం తో భద్రాచలంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడంలో ఆయన సేవలు గు ర్తుండిపోయేలా ఉన్నాయని పలువురు పేర్కొన్నారు.సీఐ నాగరాజు బదిలీ కావడంతో భద్రాచలం ప్రజలు, సమాచారం గ్రూప్ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త బాధ్యతల్లోనూ విజయవంతంగా విధులు నిర్వహించాలని, శ్రీ సీతారామచంద్రస్వామి వారి దివ్య ఆశీస్సులు నిత్యం ఆయనపై ఉండాలని ఆకాంక్షించారు.

# కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రెస్‌లోనే పొదెం వీరయ్య

- పార్టీ మారుతున్నారంటూ వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం
- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పరిమి శ్రీనివాసరావు



**భద్రాచలం, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి):** మాజీ ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పొదెం వీరయ్య కాంగ్రెస్ పార్టీని వీడుతున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని భద్రాచలం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరిమి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. రాజకీయ దురుద్దేశాలతో కొందరు చేస్తున్న ఈ ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పొదెం వీరయ్యకు కాంగ్రెస్ పార్టీతో విడదీయరాని అనుబంధం ఉందని, కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగుతాననే నిబద్ధతతో ఆయన ఉన్నారని పరిమి శ్రీనివాసరావు తెలిపారు. కాంగ్రెస్ కండువాతోనే తన అంతిమయాత్ర జరగాలని కోరుకునేంతగా పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలపై ఆయనకు గాఢమైన విశ్వాసం ఉందన్నారు.ఎన్ని రాజకీయ ఒత్తిళ్లు, ప్రలోభాలు ఎదురైనా తాను నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీని వీడకుండా మూడు దశాబ్దాలకు పైగా పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన నాయకుడు పొదెం వీరయ్య అని పేర్కొన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు అండగా నిలవడంలో ఆయన పాత్ర కీలకమన్నారు. పొదెం వీరయ్య పార్టీ మారుతున్నారంటూ సోషల్ మీడియా, వివిధ మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు, ప్రజలు నమ్మవద్దని పరిమి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. నిరాధార ప్రచారాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.కాంగ్రెస్ పార్టీలో పొదెం వీరయ్యకు ఎల్లప్పుడూ సముచిత స్థానం, గౌరవం ఉంటాయని, ఆయన కాంగ్రెస్‌లోనే కొనసాగుతారని పరిమి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆయనకు పేటెంట్ రైట్ వంటిదని వ్యాఖ్యానించారు.

# జిల్లా వనరుల అధికారి మోహన్ కుమార్ కు సన్మానం

- ఒకేరోజు రెండు అరుదైన గౌరవాలు దక్కడంతో హర్షం వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు



**భద్రాచలం, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి)** భద్రాచలం డివిజన్ పరిధిలోని 8 మండలాల ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం మంగళవారం భద్రాచలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రీ ప్రైమరీ విభాగం డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ (డీఆర్పీ) శ్రీ మల్ల మోహన కుమార్ ని ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులందరూ సన్మానించారు.

**›› ఒకేరోజు రెండు అరుదైన గౌరవాలు ....**

ఉపాధ్యాయ దినోత్సవమైన సెప్టెంబర్ 5వ తేదీన మోహన కుమార్ కి రెండు అరుదైన గౌరవాలు దక్కాయి. ఆ రోజు రాష్ట్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం, అదే రోజు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఎక్స్ పోజర్ అండ్ ఎడ్యుకేషనల్ విజిట్ కు గాను జపాన్ దేశ విద్యా విధానం సందర్శనకు ఎంపిక కావడం జరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, భద్రాచలం మండల విద్యాధికారి శ్రీ బాకుకంటి శ్రీనివాస్, 8 మండలాలకు చెందిన ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో అర్హులైన పట్టభద్రులు నమోదు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 29,(ప్రజా జ్యోతి )** వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో నమోదు ప్రక్రియపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, అర్హతలు, దరఖాస్తు విధానం, గడువును పూర్తిగా అవగాహన చేసుకుని అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే పట్టభద్రులు ఫారం–18 ద్వారా అవసరమైన వివరాలను సమర్పించాలని తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలను గెజిటెడ్ అధికారి లేదా డిజిగ్నేటెడ్ అధికారి ద్వారా ధ్రువీకరించి సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించారు.నవంబర్ 1, 2023 నాటికి పట్టభద్రులై ఉండటంతో పాటు, వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో స్థానిక నివాసులుగా ఉన్న అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. గతంలో ఓటర్ల జాబితాలో పేరు ఉండటం మాత్రమే ప్రస్తుత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియకు సరిపోదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఎన్నికల సంఘం సూచించిన విధానంలో దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా జరిగేలా సంబంధిత అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. అర్హులైన పట్టభద్రులకు ఓటరుగా నమోదు చేసుకునే ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎలక్షన్స్ సిబ్బంది నవీన్, బీజేపీ ప్రతినిధి బి. రవి నాయక్, కాంగ్రెస్ ప్రతినిధి లక్ష్మణ్ అగర్వాల్, బీఆర్ ఎస్ ప్రతినిధి అన్వర్, ఎస్. ఆనుదీప్, సీపీఐ(ఎంఎల్) ప్రతినిధి బాబూరావు, బీఎస్పీ ప్రతినిధి టి. వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# గతాన్ని విస్మరించి, మంచి సత్ప్రవర్తనతో ఉత్తమ పౌరులుగా జీవించాలి

- స్పెషల్ సబ్ జైలును సందర్శించిన ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వి. శివనాయక్



**భద్రాచలం, సెప్టెంబర్ 29, (ప్రజా జ్యోతి )** పట్టణంలోని ప్రత్యేక సబ్ జైలును మంగళవారం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి (ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ) వి. శివనాయక్ సందర్శించారు. ముందుగా జైలు సూపరింటెండెంట్ జిడుగు ఉపేందర్ స్వాగతం పలికారు. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న ప్రాథమిక వసతులు, సౌకర్యాలను న్యాయమూర్తి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వి. శివనాయక్ జైలులోని భోజన శాలను పరిశీలించి, ఖైదీలకు అందిస్తున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.జైలు నిర్బంధంలో ఉన్న సమయంలో ఖైదీలు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ... చట్టపరంగా ఉచితంగా లభించే న్యాయ సహాయాన్ని (లీగల్ ఎయిడ్) ఖైదీలు వినియోగించుకోవాలని, అలాగే జైలులోనే విద్యాభ్యాసం చేసేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న విద్యుక్త సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, గతాన్ని విస్మరించి, మంచి సత్ప్రవర్తనతో ఉంటూ సమాజంలో ఉత్తమ పౌరులుగా తిరిగి జీవనం సాగించాలని ఖైదీలకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో న్యాయమూర్తితో పాటు ప్రముఖ న్యాయవాదులు సాధనపల్లె సతీష్, బండారు రమేష్, గౌతమ్ కుమార్, శివకృష్ణ, చందనలతో పాటు జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్టీయూటీఎస్ దమ్మపేట మండల అధ్యక్షుడిగా ప్రసాద్

- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక





**దమ్మపేట,సెప్టెంబరు.29 (ప్రజాజ్యోతి):** పీఆర్టీయూటీఎస్ దమ్మపేట మండల నూతన అధ్యక్షుడిగా పీఎస్ఎస్వీ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని మల్కారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బండి శ్రీనివాసరెడ్డి సమక్షంలో నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.మండల ప్రధాన కార్యదర్శిగా ఏ.వెంకటేశ్వరరావు,గౌరవాధ్యక్షుడిగా నాగాచారి,ఉపాధ్యక్షులుగా బేతి రామకృష్ణ, శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.ఉపాధ్యాయుల హక్కులు, సమస్యల పరిష్కారానికి సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు మండలంలోని ఉపాధ్యాయులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సమావేశంలో సూచించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రమణాచారి, శ్యామలాదేవి, ఈశ్వర్ రెడ్డి,రామకృష్ణ, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం

- వృద్ధులకు గౌరవం ఇవ్వాలి-కళాశాల ప్రిన్సిపల్ ఎన్. నరేందర్




**చర్ల, సెప్టెంబర్ 29 :(ప్రజా జ్యోతి):**ప్రభుత్వ జూనియర్ కళాశాల చర్లలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల రక్షణ, సంక్షేమం, సమాజంలో వారికి కల్పించాల్సిన గౌరవం,ప్రాధాన్యతలపై విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు అవగాహన కల్పించారు. అనంతరం వయోవృద్ధుల సంక్షేమానికి సంబంధించిన ప్రతిజ్ఞను నిర్వహించారు. ఈ సందర్భగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్. నరేందర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పెద్దలకు విశిష్టమైన స్థానం ఉందన్నారు. ఆధునిక కాలంలో వృద్ధులు ఎదుర్కొంటున్న ఒంటరితనం, ఆరోగ్య సమస్యల పట్ల యువత స్పందించాల్సిన అవసరం ఉందని వృద్ధులకు ప్రేమ, ఆప్యాయత, గౌరవాన్ని అందిస్తూ వారికి అండగా నిలవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 29, (ప్రజాజ్యోతి)** వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐ.డి.ఓ.సి. సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వానాకాలం ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, వ్యవసాయ, సహకార, డీఆర్డీఏ, తూనికలు–కొలతలు, రవాణా, మార్కెటింగ్ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వానాకాలం సీజన్‌లో సుమారు 1,28,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో 1,24,119 మెట్రిక్ టన్నుల సన్న రకం, 3,881 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం ఉంటుందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు జిల్లాలో 190 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి అదనపు కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,461, సాధారణ గ్రేడ్ ధాన్యానికి రూ.2,441 మద్దతు ధరగా నిర్ణయించబడిందని తెలిపారు. సన్న రకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో బిపిటి 5204, ఆర్ ఎన్ ఆర్ 150 48, హెచ్ఎంటి సోనా, జైశ్రీరామ్ సిగ్మెంటల్, కే ఎన్ ఎం 1638, డబ్ల్యూ జి ఎల్ 44, కే ఎన్ ఎం 7715 అనే ఏడు రకాల సన్న వడ్లకు ఈ బోనస్ వర్తిస్తుందని తెలిపారు. దీంతో సన్న రకం ధాన్యానికి క్వింటాకు మొత్తం రూ.2,961 వరకు లభించేలా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో తాగునీరు, టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, తూకపు పరికరాలు, గన్నీ సంచులు తదితర అవసరమైన వసతులను ముందుగానే సమకూర్చుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎంఎస్పీ ధరలు, నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం, సన్న రకం ధాన్యానికి అందించే బోనస్, సంబంధిత అధికారుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కోసం అవసరమైన విధంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాలోకి ధాన్యం అక్రమంగా తరలివచ్చే అవకాశాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు సరిహద్దుల్లో పటిష్ట నిఘా కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ధాన్యం విక్రయ ప్రక్రియ, మద్దతు ధర, నాణ్యతా ప్రమాణాలు, సన్న రకం ధాన్యానికి లభించే బోనస్‌పై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలకు తప్పనిసరిగా ట్యాగ్, కొనుగోలు కేంద్రం నంబర్ వేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం నిల్వకు అవసరమైన గోడౌన్లు, ఫంక్షన్ హాళ్లు, ఇతర అనువైన భవనాలను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉంచాలని సూచించారు. వర్షాల కారణంగా ఏ ఒక్క ధాన్యం గింజ కూడా తడవకుండా టార్పాలిన్లు, ఇతర రక్షణ ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు.పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్లను వారి పరిధిలోని ధాన్యం నిల్వ సామర్థ్యం, అంచనా ధాన్యం పరిమాణం, అందుబాటులో ఉన్న నిల్వ సౌకర్యాలకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అయితే కొంతమంది అధికారులు అడిగిన వివరాలపై సరైన సమాధానాలు ఇవ్వకపోవడంతో కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ పరిధిలోని ధాన్యం నిల్వ సామర్థ్యం, అంచనా ధాన్యం పరిమాణం వంటి కీలక అంశాలపై అధికారులకు పూర్తి అవగాహన లేకపోవడం ఏమాత్రం సమంజసం కాదని అన్నారు. విధులకు సంబంధించిన ప్రాథమిక వివరాలపై స్పష్టత లేకుండా పనిచేయడం సరికాదని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.అక్టోబర్ 1వ తేదీ నాటికి అన్ని కొనుగోలు కేంద్రాలను తప్పనిసరిగా ప్రారంభించేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తూకపు బాట్లను ముందుగానే తనిఖీ చేసి సీల్స్ వేయాలని తూనికలు–కొలతల శాఖ అధికారులకు సూచించారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రక్షణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.2026–27 రబీ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ డెలివరీలను సకాలంలో పూర్తి చేసేలా రైస్ మిల్లులను తనిఖీ చేసి, వాస్తవ పరిస్థితులపై నివేదికలు సమర్పించాలని పౌర సరఫరాల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్ , పౌర సరఫరాల సంస్థ మేనేజర్ త్రినాధ్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, రవాణా శాఖ అధికారి భూషిత్ రెడ్డి , మార్కెటింగ్ అధికారి అలీమ్ , రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆనందరావు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపీల వైద్యానికి హద్దులు లేవా?

- అర్హత ఉందా.. అనుమతి ఉందా.. అయినా వైద్యం కొనసాగుతున్నదా?
- ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారనే ఆరోపణలపై అధికారుల నిఘా ఎక్కడ



**అశ్వారావుపేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 29** అశ్వారావుపేట మండలం గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందించాల్సిన పేరుతో పనిచేస్తున్న కొందరు ఆర్ఎంపీ/పీఎంపీల వైద్యంపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హతలు, రిజిస్ట్రేషన్, క్లినిక్‌కు అనుమతులు, అందిస్తున్న వైద్య సేవల పరిధి వంటి అంశాలపై స్పష్టత లేకుండానే కొందరు వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.ఆర్ఎంపీ అనే పేరుతో అర్హత లేని వ్యక్తులు అల్లోపతి మందులు, యాంటీబయాటిక్స్ తదితర మందులు వినియోగిస్తున్నారా? అన్నది అధికారులు తనిఖీ చేయాల్సిన కీలక అంశంగా మారింది. తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ గతంలో అర్హతలేని వ్యక్తుల క్లినిక్‌లపై దాడులు చేసి, అనుమతి లేని మందుల నిల్వలను స్వాధీనం చేసుకున్న సందర్భాలు అధికారికంగా నమోదయ్యాయి.

### »» పేరుకు ఆర్ఎంపీ.. చేస్తున్నది వైద్యమంతా?

గ్రామీణ ప్రజలకు అత్యవసర సమయంలో ప్రాథమిక సహాయం అందించాల్సిన వ్యవస్థ ఒక వైపు ఉంటే, దానిని మించి వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు మరోవైపు వినిపిస్తున్నాయి.క్లినిక్‌లో ఎవరు వైద్యం చేస్తున్నారు? వారి విద్యార్హత ఏమిటి? ఏ వైద్య మండలిలో రిజిస్ట్రేషన్ ఉందా? క్లినిక్‌కు అవసరమైన అనుమతులు ఉన్నాయా? మందులు నిల్వ చేసేందుకు, విక్రయించేందుకు చట్టబద్ధమైన లైసెన్స్ ఉందా? అనే అంశాలపై తనిఖీలు జరగాల్సి ఉంది.

### »» అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

క్లినిక్‌లు, ప్రైవేట్ ఆరోగ్య సంస్థల రిజిస్ట్రేషన్ విషయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రక్రియలు కొనసాగుతున్నాయి. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం కింద రిజిస్ట్రేషన్, రెన్యువల్ తదితర చర్యలను జిల్లా స్థాయిలో చేపడుతున్నట్లు ప్రభుత్వ జిల్లా పోర్టల్లలో స్పష్టంగా కనిపిస్తోంది.

### »» ప్రాణం పోయిన తర్వాత చర్యలెందుకు?

వైద్య రంగంలో నిర్లక్ష్యం జరిగితే దాని ప్రభావం నేరుగా రోగి ప్రాణాలపై పడే అవకాశం ఉంది. అందుకే ఘటన జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అనుమతులు, అర్హతలు, మందుల వినియోగం, క్లినిక్ నిర్వహణపై తనిఖీలు చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఎవరైనా అధికారుల అండతోనే ఇలాంటి వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు వస్తే, వాటిని ఆధారాలతో అధికారులు విచారించాలి. అదే విధంగా అక్రమంగా వైద్యం చేస్తున్నారని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. చివరిసారిగా ఎప్పుడు తనిఖీలు నిర్వహించారు?క్లినిక్‌లకు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ రిజిస్ట్రేషన్ ఉందా?ర్హత లేని వ్యక్తులు అల్లోపతి వైద్యం చేస్తున్నట్లు తేలితే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

### »» ప్రజల ఆరోగ్యంపై రాజీ వద్దు

ఆర్ఎంపీ అనే పేరు పెట్టుకున్న ప్రతి వ్యక్తినీ ఒకే కోణంలో చూడటం కాదు. అర్హత, రిజిస్ట్రేషన్, చట్టబద్ధ అనుమతులు, చేస్తున్న వైద్య సేవల పరిధి ఆధారంగా ఒక్కొక్కరిని అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు చట్టబద్ధమైన, సురక్షితమైన వైద్యం అందేలా పర్యవేక్షణ ఉండటమే అసలు లక్ష్యం.ప్రాణం విలువైనది.. వైద్యంలో నిర్లక్ష్యానికి తావుండకూడదు.అధికారుల తనిఖీలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించాలనే డిమాండ్ ప్రజల్లో వినిపిస్తోంది.